సాక్షి
కాకినాడ
సోమవారం । 11 । ఆగస్టు । 2025



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డి.చిన్నవీరాస్వామి దంపతులు (విజయనగరం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



పరిశోధనలకు ప్రోత్సాహం ప్రయాస్

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయాస్ పథకం అమలు చేస్తోంది.

8లో

కడలిలోకి 98 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 98,476 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,700, పశ్చిమ డెల్టాకు 7 వేలు కలిపి మొత్తం 14,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఏలేరులో 10.66 టీఎంసీల నీటి నిల్వలు



ఏలేరు రిజర్వాయర్

ఏలేశ్వరం: ఎగువ నుంచి వస్తున్న సహజ ప్రవాహంతో పాటు గోదావరి జలాలు కూడా వచ్చి చేరుతూండటంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరిగాయి. ఎగువ నుంచి 1,540, తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 1,225 క్యూసెక్కుల చొప్పున నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ఆదివారం 10.66 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం 77.45 మీటర్లకు చేరింది. రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు 1,700, విశాఖకు 300, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

తలుపులమ్మ తల్లికి మకర తోరణం



మకర తోరణం అలంకరించి, అమ్మవారిని దర్శించుకుంటున్న దాత కుటుంబ సభ్యులు

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారికి మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్ ఆదివారం రూ.1.25 లక్షల విలువైన మకరం తోరణం సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం దాత కోరిక మేరకు దీనిని అమ్మవారికి అలంకరించామని ఆలయ కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఈ మకర తోరణాన్ని 8 కిలోల రాగి, ఇతర లోహాలతో తయారు చేశారన్నారు.

లోవలో భక్తుల సందడి

తలుపులమ్మ తల్లి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. సుమారు 18 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ ప్రసాదం, పూజా టికెట్లు, వసతి గదులు తదితర రూపాల్లో రూ.5,00,279 ఆదాయం లభించిందని వివరించారు.

సత్యదేవునికి వెండి పళ్లెం, శఠారి సమర్పణ



వెండి పళ్లెం, శఠారిని ఈఓకు అందజేస్తున్న దాతలు

అన్నవరం: ప్రస్తుతం లండన్‌లో నివసిస్తున్న ఎం.సూర్యనారాయణ దంపతులు (తూర్పు గోదావరి జిల్లా) సత్యదేవునికి 1.034 కిలోల బరువైన వెండి పళ్లెం, వెండి శఠారి ఆదివారం సమర్పించారు. వీటి విలువ రూ.1.13 లక్షలని వారు తెలిపారు. వీటిని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు అందజేసి స్వామివారి పూజా కార్యక్రమాల్లో ఉపయోగించాలని కోరారు. వెండి పళ్లెం బరువు 521.700 గ్రాములు, శఠారి బరువు 512.500 గ్రాములని అధికారులు తెలిపారు.

నేడు పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

13న వాలీబాల్ జట్ల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 13న అండర్–15 వాలీబాల్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. డిసెంబర్ 4 నుంచి 13వ తేదీ వరకూ చైనాలోని శాంగ్లో‌లో జరగనున్న అండర్–15 బాలబాలికల ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల కోసం ఈ ఎంపికలు జరుగుతున్నాయని వివరించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18న విజయవాడ కేబీసీ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ ఎంపికలకు హాజరు కావాలని జార్జి కోరారు. వివరాలకు 83091 00589 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తొలి అడుగు.. తడబాటు..

- బీటెక్ ఫస్టియర్‌లో 65 శాతం దాటని ఉత్తీర్ణత
- విద్యార్థులకు తప్పని బ్యాక్‌లాగ్‌ల బాధ
- ఫస్టియర్ నుంచే పట్టు సాధిస్తే మంచి భవిష్యత్తుకు అవకాశాలు
- విద్యావేత్తల సూచన



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ విద్యలో విద్యార్థికి ప్రతి అడుగూ కీలకమే. నాలుగేళ్ల కోర్సు వ్యవధిలో.. ఎనిమిది సెమిస్టర్లలో పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూండటం ఆందోళన కలిగిస్తోంది. జేఎన్‌టీయూకే విడుదల చేస్తున్న ఫలితాల ప్రకారం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉత్తీర్ణత కనీసం 65 శాతం కూడా దాటడం లేదు. దీనినిబట్టి ఆయా విద్యార్థుల ప్రతిభ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని విద్యారంగ నిపుణులు అంటున్నారు. ఇటీవలే బీటెక్ ప్రథమ సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. వీటిలో ఉత్తీర్ణత కనీసం 65 శాతం కూడా దాటలేదు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సైతం ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలవుతున్నారు. భావి భారత యువ ఇంజినీర్లు తొలి అడుగులోనే ఇలా తడబడుతూంటే.. మిగిలిన మూడు సంవత్సరాల గురించి ఇక చెప్పనవసరమే ఉండదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ బ్యాక్‌లాగ్స్ గుదిబండలా మారే ప్రమాదం ఉంటుంది. ఇది వారి భవిష్యత్తు అవకాశాలపై ప్రభావం చూపుతుందని విద్యావేత్తలు అంటున్నారు. వీలైనంత త్వరగా సబ్జెక్టులు క్లియర్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

సెల్ఫ్ లెర్నింగ్ మేలు

ఇంజినీరింగ్ విద్యలో బట్టీ విధానం కంటే అప్లికేషన్ ఓరియెంటేషన్‌కు అధిక ప్రాధాన్యం ఉంటుంది. స్పూన్ ఫీడింగ్‌కు అవకాశం ఉండదు కాబట్టి సెల్ఫ్ లెర్నింగ్ అలవరచుకోవడం తప్పనిసరి. మేసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్), నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) మార్గాల ద్వారా సబ్జెక్టులపై సొంతంగా అవగాహన ఏర్పరచుకొనేందుకు నిరంతరం కృషి చేయాలి.

ఎప్పటికప్పుడే సందేహాల నివృత్తి

సబ్జెక్టుకు సంబంధించిన సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. తరగతి గదిలో అందరి ముందు సందేహాలు అడగడానికి బిడియంగా ఉంటే అధ్యాపకులను స్టాఫ్ రూములో స్వయంగా కలసి, నివృత్తి చేసుకోవాలి. సమస్యను నివృత్తి చేసుకునే సమయంలో నోట్‌బుక్ వంటివి తప్పకుండా ఉంచుకోవాలి. అవసరమైన విషయాలను అక్కడికక్కడే రాసుకోవాలి.

ఏ రోజు పాఠాలు ఆ రోజే..

ముఖ్యంగా ఏకాగ్రత పెంచుకుంటూ ఏ రోజు పాఠాలు ఆ రోజే పూర్తి చేసుకోవాలి. క్లాసుకు వెళ్లేటప్పుడు ఆ రోజు బోధించే పాఠ్యాంశాన్ని ముందుగానే తెలుసుకుని, దానిపై కనీస అవగాహన పెంచుకోవాలి. అప్పుడే ఆ పాఠ్యాంశం మరింత సులభంగా అర్థమవుతుంది. అధ్యాపకుల నోట్స్‌తో పాటు రిఫరెన్స్ పుస్తకాల సహాయంతో నోట్స్ సిద్ధం చేసుకోవాలి. పరీక్షల సమయంలో ప్రీవియస్ పేపర్లు ప్రాక్టీస్ చేయ్యాలి. ఇలా చేస్తే బ్యాక్‌లాగ్స్ సమస్య తప్పుతుంది.

ఇలా చేయాలి

- ఇంజినీరింగ్ విద్యలోకి ప్రవేశించగానే సీనియర్ల సలహాతో ముందుకెళ్లాలి.
- అధ్యాపకులు చెప్పేది శ్రద్ధగా వినాలి. అర్థం కాకపోతే మళ్లీ అడిగి తెలుసుకోవాలి.
- హాజరు 80 శాతం పైబడి ఉండాలి.
- నేటి కాలంలో డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి.
- కళాశాలల్లో సదస్సులకు హాజరవడం ద్వారా విద్యార్థుల్లో ఉన్న భయం పోతుంది.
- బీటెక్‌లో కనీసం 60 శాతం ఉత్తీర్ణత ఉంటేనే కానీ టీసీఎస్, ఎసెంచర్ వంటి ప్రముఖ సంస్థల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం ఉండదు.

నిర్లక్ష్యం చేయొద్దు



ఇంజినీరింగ్‌లో ఫస్టియర్ నుంచే చదవుపై శ్రద్ధ వహించాలి. సబ్జెక్టులపై ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదు. దీనిని మొదటి నుంచే అలవాటు చేసుకోవాలి. అన్ని సబ్జెక్టుల్లోనూ మొదటి ప్రయత్నంలోనే పాసయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. సబ్జెక్టుల్లో ఫెయిలవుతూంటే క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు హాజరయ్యే అవకాశాన్ని విద్యార్థులు కోల్పోతారు. అలాగే, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే వారు వీసా తిరస్కరణకు గురవుతారు. డిగ్రీ పట్టా సమయానికి చేతికి రాకపోతే ఉద్యోగ సాధన కష్టతరమవుతుంది. అలాగే, మల్టీ నేషనల్ కంపెనీల ఇంటర్వ్యూలకు కూడా అర్హత కోల్పోతారు.

– ఎ.గోపాలకృష్ణ, మెకానికల్ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే

సెమిస్టర్ విధానం కొత్తగా ఉంటుంది



ఇంజినీరింగ్ విద్యలో సెమిస్టర్ విధానంలో పరీక్షలు విద్యార్థులకు కొత్తగా ఉంటాయి. అప్పటి వరకూ ఉన్న మాదిరిగా ఏడాది చివరిలో పరీక్షలు రాసే విధానం ఉండదు. కళాశాలలో చేరిన రెండు నెలలకు మిడ్.. ఆ తరువాత మూడు నెలలకు సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. ఈ విధానం వారికి కాస్త ఇబ్బందికరంగా మారుతుంది. కానీ, ఉత్తీర్ణత శాతం పెరగడానికి సెమిస్టర్ విధానం మంచి దారి అని ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థీ గ్రహించాలి.

– ప్రొఫెసర్ ఎన్.మోహనరావు, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూకే

స్కిల్స్ పెంపొందించుకోవాలి



తొలి ఏడాది గణితం, భౌతిక శాస్త్రంపై దృష్టి పెడుతూనే ఏదో ఒక ప్రోగ్రామింగ్ నేర్చుకోవాలి. కోడింగ్, రోబోటిక్స్ క్లబ్బుల్లో చేరాలి. ద్వితీయ సంవత్సరంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. మేట్‌ల్యాబ్, క్యాడ్, సిమ్యులేషన్ టూల్స్, ఎన్‌పీటీఈఎల్ వంటి అదనపు కోర్సులు చేయాలి. గేట్, జీఆర్ఈలకు సన్నద్ధమవుతూ సమ్మర్ ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం సాధించాలి.

– కె.పద్మరాజు, ఈసీఈ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే

పెద్దాపురం.. ఈ నేల పునీతం



సభలో ప్రసంగిస్తున్న కృష్ణబాబు

పెద్దాపురం: నాటి ఏనుగు లక్ష్మణ కవి నుంచి నేటి వంగలపూడి శివకృష్ణ వరకూ వందలాదిగా కవులు, రచయితలు, కళాకారులు పెద్దాపురం నేలను పునీతం చేశారని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన 'చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక పెద్దాపురం వైభవం పరిచయ కవి సమ్మేళన సభ'కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాహిత్య సంపదను సుస్థిరం చేసిన నేల పెద్దాపురమని, సాహిత్యానికి విశ్వవ్యాప్త ప్రఖ్యాతిని తీసుకుని వచ్చిందని అన్నారు. 'సాహితీ వనం – మన పెద్దాపురం' పేరిట కవితాలాపన చేసి సభికులను అలరించారు. చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ మాట్లాడుతూ, పౌరాణిక, చారిత్రక, భౌగోళిక, రాజకీయ పరంగా పెద్దాపురం ప్రాధాన్యం.. మహారాజుల పాలన, ఆధ్యాత్మిక క్షేత్రాలు.. స్వాతంత్ర్యోద్యమంలో పాత్ర, సమరయోధుల పోరాటాలను వివరించారు. 'చారిత్రక పెద్దాపురం' కవిత చదివి వినిపించారు. ఈ చరిత్రను ప్రపంచానికి, భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలని, సాహితీ సభలను నిరంతరం నిర్వహించాలని కోరారు. సీనియర్ పాత్రికేయుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ, పెద్దాపురం దేవదాసీ సంస్కృతి, ఆచారాలు, ఆలయ నిర్వహణ, కళాకారుల కృషి తదితర అంశాలపై ప్రసంగించారు. సాహితీ స్రవంతి గాయని దువ్వూరి అన్నపూర్ణ 'పెద్దాపురం చరిత్రకు వందనాల'ంటూ గేయాలాపన చేసి సభికులను అలరించారు. కామవరపు లక్ష్మీ కామేశ్వరరావు పెద్దాపురం వైభవంపై కవితా గానం చేశారు. ఇతర రాష్ట్రాల్లో పెద్దాపురం గుర్తింపు, సినీ, క్రీడా రంగ ప్రముఖుల గురించి వివరించారు. ఇంకా పలువురు కవులు పెద్దాపురం వైభవంపై రచించిన కవితలతో సభికులను రంజింపజేశారు. సీపీఎం నాయకుడు నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



అయినవిల్లి విఘ్నేశ్వరుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి వారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యాన స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష అర్చనలు జరిపారు. స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. మహా నివేదన చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి, ఆలయ తలుపులు మూసివేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 39 మంది పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 17 జంటలు పాల్గొన్నాయి. స్వామివారికి ఆరుగురు భక్తులు ఉండ్రాళ్ల పూజ జరిపారు. 12 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ఆరుగురు చిన్నారులకు తులాభారం, తొమ్మిది మందికి అన్నప్రాశన నిర్వహించారు. 33 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2,180 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజే వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా స్వామివారికి రూ.2,56,461 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

మళ్లీ అదే తప్పే

- సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం ముందు భారీ పెళ్లి సెట్టింగ్
- విశ్రాంతి షెడ్డు సగం ఆక్రమించి.. అట్టహాసంగా వివాహం
- సూర్య నమస్కారాల వద్దకు భక్తులు వెళ్లకుండా అడ్డంగా సామగ్రి
- సేద తీరే వీలు కూడా లేని వైనం



సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం కనిపించకుండా వేసిన వివాహ సెట్టింగ్

అన్నవరం: ఒకసారి చేస్తే పొరపాటు.. మళ్లీ మళ్లీ అదే తప్పు చేస్తే అది అలవాటుగా మారిందనే అంటారు. అన్నవరం దేవస్థానంలో అధికారుల తీరు ఇలాగే ఉంటోందన్న విమర్శలు వస్తున్నాయి. ఏం జరిగిందంటే.. అధికార పార్టీ నాయకుల సిఫారసుతో రత్నగిరిపై సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం ముందు దేవస్థానం అధికారులు గత జూన్ 8న ఓ వివాహానికి అనుమతి ఇచ్చారు. అప్పట్లో ఆ వివాహ బృందం వారు అక్కడి విశ్రాంతి షెడ్డులో సగ భాగాన్ని ఆక్రమించారు. దీంతో, భక్తులు ఇబ్బందులు పడ్డారు. నాడు అధికారులు వ్యవహరించిన తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. సహజంగానే విమర్శలు వచ్చినప్పుడు తమ వైపు తప్పుంటే ఎవరైనా అది పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ, అదే వార్షిక కల్యాణ మండపం ముందు ఆదివారం తెల్లవారుజామున ఓ పెళ్లి బృందం వారు విశ్రాంతి షెడ్డులో సగ భాగాన్ని ఆక్రమించారు. భక్తులు ఆ ఛాయలకు రాకుండా కుర్చీలు వేశారు. అడ్డంగా రిబ్బన్ కట్టారు. భారీ పెళ్లి మండపం ఏర్పాటు చేసి, అట్టహాసంగా వివాహం జరిపించారు. ఉదయం 9.30 గంటల వరకూ ఆ వివాహ తంతు కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం వరకూ కూడా ఆ మండపాన్ని అలాగే ఉంచేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆదివారం కావడంతో వార్షిక కల్యాణ మండపంలో పండితులు సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ వివాహ సెట్టింగ్‌తో సూర్య నమస్కారాలు భక్తులకు కనిపించనే లేదు. పండితులు ఆ సెట్టింగ్ వెనుకనే ఉండి సూర్య నమస్కారాలు నిర్వహించాల్సి వచ్చింది. భక్తులు అక్కడకు వెళ్లి తీర్థప్రసాదాలు స్వీకరించే వీలు లేకుండా వివాహ మండప సామగ్రిని సంబంధిత సిబ్బంది అడ్డంగా పెట్టారు. ఈఓ కార్యాలయం సమీపంలోనే.. అందరి కళ్లెదుటే ఇంత జరుగుతున్నా అధికారులు కానీ, సిబ్బంది కానీ పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే ఈ వివాహానికి అనుమతిచ్చారని సమాచారం. అయితే దీనిపై అధికారులు నోరు విప్పడం లేదు.

సర్వత్రా విమర్శలు

సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం ముందు దేవస్థానం వైదిక క్రతువులు తప్ప ఇతర కార్యక్రమాలు నిర్వహించరు. అది కూడా వార్షిక కల్యాణ మండపాన్ని మూసివేసేలా ఎటువంటి సెట్టింగ్‌లూ వేయరు. వివాహ ముహూర్తాల సమయంలో అక్కడి విశ్రాంతి మండపంలో పేద, మధ్యతరగతి వారు చిన్నచిన్న మండపాలు వేసుకుని తమ బిడ్డల వివాహాలు చేసుకుంటూ ఉంటారు. ఆ షెడ్డు నిర్మించక ముందు నుంచే ఆ ప్రాంతంలో అలా వివాహాలు చేసుకుంటున్నారు. కానీ, ఎప్పుడూ పెద్ద పెద్ద సెట్టింగ్‌లు వేసి వివాహాలకు అనుమతించింది లేదు. వార్షిక కల్యాణ మండపంలో ఏటా భోగి పండగ నాడు సంక్రాంతి వేడుకలు, చైత్ర మాసంలో శ్రీరామ నవమి నాడు సీతారాముల కల్యాణం, వైశాఖ మాసంలో సత్యదేవుని కల్యాణం ఘనంగా నిర్వహిస్తుంటారు. దేవస్థానం వైదిక కార్యక్రమాలు, లక్ష తులసి అర్చన, ఐదు రోజుల పాటు జరిగే యాగాలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా ఇక్కడ నిర్వహిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ మండపం ఎదురుగా పెద్ద వివాహ సెట్టింగులను అనుమతించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ వివాహాలకు ఈవిధంగా అనుమతివ్వలేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనే ఇటువంటివి జరుగుతున్నాయనే అభిప్రాయాన్ని దేవస్థానం సిబ్బంది కూడా వ్యక్తం చేస్తున్నారు.

కొండ.. భక్తులే నిండా..

- భక్తులతో కిక్కిరిసిన రత్నగిరి
- సత్యదేవుని దర్శించుకున్న 40 వేల మంది
- 2,100 వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన నవ దంపతులు, వివాహ బృందాలు, భక్తులతో రత్నగిరి ఆదివారం కిక్కిరిసిపోయింది. సత్యదేవుని దర్శనానికి ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద సంఖ్యలో భక్తులు ప్రవాహంలా తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత మండపాలన్నీ నవ దంపతులు, భక్తులతో రద్దీగా కనిపించాయి.

నవ దంపతులు, పెళ్లి బృందాలతో..

రత్నగిరిపై శనివారం రాత్రి, ఆదివారం వేకువజామున ముహూర్తాల్లో సుమారు వంద వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాల్లో కూడా ఇవే ముహూర్తాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధుమిత్రులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. దీంతో, ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు.. ఇలా ప్రతిచోటా నవ దంపతులే కనిపించారు. దీంతో, ఆలయం పెళ్లి కళను అద్దుకున్నట్టు కనిపించింది. వందలాదిగా నవదంపతులు సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వందలాదిగా వాహనాల్లో వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఉదయం 10 గంటల వరకూ దేవస్థానం ఘాట్ రోడ్డులో కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,100 జరిగాయి. ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీ కారణంగా రూ.200 టికెట్టు తీసుకున్న భక్తులను కూడా మధ్యాహ్నం వరకూ అంతరాలయ దర్శనానికి అనుమతించలేదు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు.


ఘనంగా రథసేవ

సత్యదేవుడు అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఆదివారం ఉదయం ఆలయ ప్రాకారంలో టేకు రథంపై ఘనంగా ఊరేగించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఉదయం 10 గంటలకు ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చి రథంపై వేంచేయించారు. అనంతరం, అర్చకుడు దత్తాత్రేయశర్మ, పరిచారకుడు గణేష్ పూజలు చేసి రథ సేవ ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్య ఘోష నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, స్వామి, అమ్మవార్లను రథంపై ఆలయ ప్రాంగణంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం పూజలు చేసి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు కూడా రద్దీ !

సత్యదేవుని సన్నిధిలో ఆదివారం రాత్రి కూడా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఆలయ ప్రాంగణంలోని రామాలయం వద్ద ఉన్న విశ్రాంతి మండపంలో ఆదివారం రాత్రి 11 గంటలు, తెల్లవారుజాము ముహూర్తాల్లో వివాహాలకు మండపాలను సిద్ధం చేశారు. దేవస్థానంలోని పలు మండపాల్లో కూడా పలు వివాహాలు జరగనున్నాయి. ఆ నవ దంపతులు, ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు కూడా సోమవారం సత్యదేవుని దర్శించుకోనున్నారు. దీంతో, రత్నగిరిపై తీవ్ర రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. పెళ్లి బృందాలకు తోడు ఇతర భక్తులు కూడా భారీ సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉంది. వివాహాల నేపథ్యంలో సాధారణ భక్తులకు సత్రాల్లో గదులు లభించే అవకాశం తక్కువగానే ఉంటుందని చెబుతున్నారు.

వాడపల్లి క్షేత్రంలో అన్నప్రసాద భవనానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బెల్లంకొండ కృష్ణమూర్తి, గొడవర్తి వరలక్ష్మి, కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు. అలాగే, పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు రూ.25,116 సమర్పించారు. అనంతరం దాతలు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి పడి దింపు కార్మికుడి మృతి



ఘటనా స్థలంలో మృతదేహం



పండు (ఫైల్)

కొత్తపేట: కొబ్బరి కాయల దింపు కోసం చెట్టు ఎక్కిన కార్మికుడు ప్రమాదవశాత్తూ కింద పడి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం వసంతవాడ గ్రామానికి చెందిన కారింకి వీరవెంకట సత్యనారాయణ (పండు) (42) కొబ్బరి దింపు కార్మికుడు. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలో కొబ్బరి దింపు కోసం చెట్టు ఎక్కి కింద పడి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.

గ్రామంలో విషాద ఛాయలు

దింపు కార్మికుడు పండు మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పండుకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా రోదించారు. అందరితో కలసిమెలసి ఉంటూ, సహచర దింపు కార్మికులకు అండగా ఉండే పండు మృతి చెందాడని తెలిసి పలువురు గ్రామస్తులు, దింపు కార్మికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కేవలం కొబ్బరి దింపులు తీసుకుంటూ జీవనం సాగించే అతని మృతితో ఆ కుటుంబం జీవనాధారం కోల్పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అమ్మమ్మ చెంతకు చేరిన బాలిక



తప్పి పోయిన బాలికను అమ్మమ్మకు అప్పగిస్తున్న రైల్వే అధికారులు

సామర్లకోట: వరుసగా మూడురోజుల పాటు సెలవులు రావడంతో ఆయా ప్రాంతాలకు తిరిగి వెళ్లడానికి రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లు ఆదివారం ప్రయాణికులతో నిండిపోయాయి. ఈ తరుణంలో ఆదివారం జోన్నాదుల వెంకటసాయమ్మ తన మనువరాలు జ్యోత్స్నతో కలిసి చీరాలకు వెళ్లడానికి రైల్వే స్టేషన్‌కు వచ్చింది. టిక్కెట్టు తీసుకొవడానికి కౌంటర్ వద్దకు వెళ్లిన సమయంలో జనంతో కలిసి జ్యోత్స్న ఒకటవ నెంబరు ప్లాటుఫారం పైకి వచ్చింది. అక్కడ అమ్మమ్మ కనిపించక పోవడంతో ఏడుస్తూ ఉండటాన్ని స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ అనంత లక్ష్మీ గమనించారు. రైల్వే స్టేషన్‌లోని మైక్ ద్వారా ప్రకటించారు. అప్పటికే టిక్కెటు తీసుకున్న వెంకటసాయమ్మ మనవరాలి కొసం కౌంటర్ వద్ద వెతుకుతూ ఉంది. ఈ తరుణంలో మైక్ ద్వారా సమాచారం రావడంతో ఊపిరి పీల్చుకుని స్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళ్లింది. అచ్చట స్టేషన్ మేనేజరు ఎం రమేష్ కౌన్సెలింగ్ చేసి బాలికను ఆర్‌పీఎఫ్ సిబ్బంది సమక్షంలో వెంకటసాయమ్మకు అప్పగించారు.

పరిశోధనలకు ప్రోత్సాహం ప్రయాస్

- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యం



ప్రయాస్ లోగో



రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనాక్, జాతీయ సైన్స్ దినోత్సవం వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనేందుకు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంటోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)- ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ యాటిట్యూడ్ అమాంగ్ యంగ్ అండ్ యాస్పైరింగ్ స్టూడెంట్స్ (ప్రయాస్) పథకాన్ని ఎప్పటి నుంచో అమలు చేస్తోంది. అందులో పరిశోధన ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆహ్వానించేందుకు దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించింది.

అర్హతలు - నిబంధనలు

- ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతులు, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఒక పాఠశాల నుంచి ఒకరు లేదా ఇద్దరు విద్యార్థులు పాల్గొనవచ్చు. పాఠశాలల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లేదా గణితం బోధించే పీజీటీ/టీజీటీ ఉపాధ్యాయుడు, ఏదైనా ఒక ఉన్నత విద్యా సంస్థ, పరిశోధన సంస్థ నిపుణుడితో కలిసి పరిశోధన ప్రాజెక్టును సమర్పించాలి.
- ఒక పాఠశాల నుంచి ఒక దరఖాస్తును మాత్రమే పరిశీలిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంది. పూర్తి సమాచారాన్ని ఎన్‌సీఈఆర్‌టీ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు.
- విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు గైడ్ టీచర్‌గా వ్యవహరిస్తారు. ఉన్నత విద్యాసంస్థల సైన్స్ సబ్జెక్ట్ నిపుణుల నుంచి సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు పొందవచ్చు.

మంచి ప్రాజెక్టులను ఎంపిక చేసుకోవాలి



ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పనలో భాగస్వాములు అయ్యే విధంగా సైన్స్ ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాలి. జాతీయ స్థాయిలో ప్రాజెక్టులు ఎంపికవ్వాలంటే సమస్యను ప్రతిబింబించడంతో పాటుగా, మంచి పరిష్కారాన్ని చూపించాలి. ప్రతి ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రధాన తేదీలు

దరఖాస్తు చేసేందుకు గడువు: ఆగస్టు 17
దరఖాస్తుల స్క్రీనింగ్: సెప్టెంబర్ 15
జ్యూరీ ఎంపిక గడువు: సెప్టెంబర్ 30
ఫలితాల ప్రకటన: అక్టోబర్ 15
ఎంపికైన ప్రాజెక్టుల ప్రారంభం: అక్టోబర్ 16
ప్రాజెక్టు ముగింపు తేదీ: అక్టోబర్ 16, 2026.
రిపోర్టు సబ్మిషన్: అక్టోబర్ 20, 2026.

ఎంపికైన వారికి రూ.50వేల నగదు

విద్యార్థులు స్థానికంగా ఉన్న ఒక సమస్యను గుర్తించి, దానిని అధ్యయనం చేయాలి. సమస్య పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలి. శాస్త్రీయ పరిశోధన చేసి, సమస్య పరిష్కారానికి మార్గాలు చూపిస్తూ రిపోర్టును సమర్పించాలి. ప్రాజెక్టును ఏడాది లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎన్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసిన పరిశోధనకు కేంద్ర ప్రభుత్వం రూ.50వేలు మంజూరు చేస్తోంది. మంజూరైన నిధులను పరిశోధనకు, ప్రాజెక్టు రూపకల్పనకు వినియోగించుకోవచ్చు. పరిశోధన సామగ్రి, ప్రయాణ ఖర్చులకు ఈ నిధులను ఉపయోగించుకోవచ్చు. ఈ నిధుల నుంచి విద్యార్థులకు రూ.10 వేలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉన్నత విద్యాసంస్థ సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌కి రూ.20 వేల వంతున అందజేస్తారు.

మూడు హత్యలకు నిరసనగా శాంతి ర్యాలీ

- నిందితుడికి ఉరి శిక్ష వేయాలని డిమాండ్
- సీబీఎం సెంటర్‌లో మానవహారం



హత్యలకు నిరసనగా శాంతి ర్యాలీ నిర్వహించిన దళిత సంఘాల నాయకులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక భాగంలో ఉన్న సీతారామ కాలనీలో నివాసం ఉంటున్న ఒక వివాహిత, ఇద్దరు బాలికలను దారుణంగా హత్య చేసినందుకు నిరసనగా ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు, మానవహక్కుల సంఘ నాయకుల మద్దతుతో స్థానిక సీబీఎం సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి సీతారామ కాలనీలో నివాసం ఉంటున్న ములపర్తి మాధురి (30) కుమార్తెలు పుష్పకుమారి (8), జెస్సీలోన(6)లను హత్య చేసిన విషయం విదితమే. 3వ తేదీ ఉదయం ఇంటికి వచ్చిన మాధురి భర్త ధనుప్రసాద్ హత్య జరిగిన విషయాన్ని గమనించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్పీ ఆదేశాలలో పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడు స్థానిక కోటపేటకు చెందిన తలే సురేష్‌ను ఈ నెల 7వ తేదీన అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించిన విషయం విదితమే. ఇటువంటి మానవమృగాలకు బుద్ధి వచ్చే విధంగా ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీబీఎం సెంటర్‌లో పిల్లలు, పెద్దలు, మహిళలతో కలిసి మానవహారం నిర్వహించారు. దళిత సంఘ నాయకులు పిట్టా జానికిరామారావు, లింగం శివప్రసాద్, జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ సురేష్ తరఫున ఏ న్యాయవాది వాదించకుండా చూడాలన్నారు. మానసికంగా కృంగి పాయిన ములపర్తి మాధురి భర్త ధనుప్రసాద్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాధురి తల్లి ఫిర్యాదును కాకుండా భర్త ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని కోర్టు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. సుమారు 30 నిమిషాల పాటు సీబీఎం సెంటర్‌లో మానవ హారం నిర్వహించడంతో నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడి నుంచి పోలీసు స్టేషన్ మీదుగా సంతమార్కెట్, పాత తహసీల్దార్ కార్యాలయం, బ్రౌన్‌పేట సెంటర్ నుంచి తిరిగి సీబీఎం సెంటర్ వరకు శాంతి ర్యాలీ చేరింది. సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దళిత సంఘ నాయకులు జుత్తుక అప్పారావు, పాలిక చంటి బాబు బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

పోలీసుల వేషధారణతో ఘరానా మోసం

చేతి ఉంగరం తీసుకుని పరార్

కరప: ఇంటి దొంగతనాలు, దారిలో చైన్ స్నాచింగ్‌లు, మార్కెట్ సెంటర్లలో, ఇళ్ల వద్ద ఉండే సైకిళ్లు, మోటార్ సైకిళ్ల దొంగతనాలు ఇంతవరకు చూశాం. దొంగలు కూడా తమపంథాను మార్చుకుని, పోలీసుల వేషధారణతోనే దొంగతనం చేస్తే, ఎవరికీ దొరకమని ఎత్తుగడ వేశారు. అనుకున్నదే తడవుగా పట్టపగలు, అందరూ వెళ్లే ట్రాఫిక్‌లో ఒక మోటార్ సైకిలిస్టును ఆపి, చేతులు గంజాయి వాసన వస్తోందని బెదిరించి, చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని తీసుకుని సదరు దొంగలు పలాయనం చిత్తగించారు. ఈ ఘటన కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారిలో నడకుదురు వద్ద జరిగింది. ఇంత జరిగినా బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం విశేషం. వివరాలు ఇలా ఉన్నాయి. కరప గ్రామానికి చెందిన ఒక వ్యక్తి(పేరు చెప్పడానికి ఇష్టపడలేదు) శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై కాకినాడ వెళ్లేందుకు బయలుదేరాడు. నడకుదురులోని మార్కెట్ యార్డు సమీపంలోకి వెళ్లే సరికి పోలీసు యూనిఫారమ్‌లో ఉన్న ఇద్దరు అతన్ని ఆపారు. నీ చేతులు చూపించు, గంజాయి వాసన వస్తోంది ఏమిటని బెదిరించి, చేతికి ఉన్న బంగారు ఉంగరం(కాసు బంగారం), బండి తాళం తీసుకుని పెద్ద సార్ ముందు ఉన్నారు అక్కడకు రమ్మని చెప్పి ఆ దొంగలు మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. కొంతదూరమెళ్లి చూసేసరికి ఎవరూ కనబడకపోయేసరికి, మోసపోయానని బాధితుడు గ్రహించాడు. తన స్నేహితులను పిలిచి, వారి సాయంతో బండిని ఇంటికి చేర్చాడు. పోలీసుస్టేషన్‌కు వెళితే పరువు పోతుందనుకున్నాడో, ఏమో ఈ దొంగతనంపై ఫిర్యాదు చేయలేదు. దీనిపై కరప పోలీసులను వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. కాగా స్థానికంగా కొంతమంది ఈ విషయాన్ని చెప్పడంతో కరప ఎస్‌ఐ టి.సునీత ఘటనా స్థలానికెళ్లి, పరిసరాలను పరిశీలించారు.

సెమీస్ దశలో సీబీఎస్‌సీ బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ సురేష్‌నగర్‌లో శ్రీప్రకాష్ స్కూల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీబీఎస్‌సీ క్లస్టర్ బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజు ఆదివారం క్వార్టర్స్ దశ పూర్తి చేసుకుని సెమీస్ దశకు చేరుకున్నాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో క్రీడాకారులు ప్రత్యర్థులతో తలపడ్డారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు పరిశీలకునిగా గణేష్, జాతీయస్థాయి రిఫరీలుగా శ్రీనివాస్, భద్రంల పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. ప్రిన్సిపాల్ శ్రీదేవి, డైరెక్టర్ విజయ్ ప్రకాష్ ఆదివారం మ్యాచ్‌లను ప్రారంభించారు.

సెమీస్‌కు చేరిన జట్ల వివరాలు

అండర్-14 బాలుర విభాగంలో..

సిల్వర్ హోక్స్ స్కూల్ (హైదరాబాద్), ఇండస్ యూనివర్సల్ స్కూల్ (హైదరాబాద్), సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్(ఏలూరు), మౌంట్‌లిటిరా జి.స్కూల్ (మణికొండ)

అండర్-17 బాలుర విభాగంలో ..

గాడియమ్ స్కూల్ (హైదరాబాద్), పల్లవి మోడల్ స్కూల్ (సికింద్రాబాద్), ఎస్టిజోసెఫ్ ఇంగ్లిష్ స్కూల్(కర్నూల్), డీపీఎస్ (ఆనందపురం, వైజాగ్)

అండర్-19 బాలుర విభాగంలో..

నీలకంత విద్య పీట్ (తెలంగాణ), సిల్వర్ హోక్స్ స్కూల్ (హైదరాబాద్), వికాస్ ద కాన్సెప్ట్ స్కూల్(హైదరాబాద్), హ్యాపీ వాలీ స్కూల్ (విజయవాడ)

గిరి గీసుకున్న నాలుగో సింహం

- బంగారం చోరీ మా పరిధిలోనిది కాదంటూ కేసు కట్టని వైనం
- జగ్గంపేట, గండేపల్లి పోలీసుల వైఖరితో బాధితురాలికి జరగని న్యాయం

గండేపల్లి: బాధితులకు బాసటగా నిలిచి న్యాయం చేస్తారని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కినప్పటికీ పరిధి మాది కాదంటే మాది కాదని చెప్పడంతో ఏమి చేయాలో దిక్కుతోచక బాధితులు మౌనం వహించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల మేరకు జగ్గంపేటకు చెందిన పాలేపు వరలక్ష్మి భర్త శశికుమార్‌తో కలిసి జూలై 31న రాజమహేంద్రవరంలో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా భర్త శశికుమార్‌కు విధి నిర్వహణలో భాగంగా ఫోన్ రావడంతో మండలంలోని మల్లేపల్లిలో భార్య వరలక్ష్మిని జగ్గంపేటకు ఆటో ఎక్కించి ఆయన విధి నిర్వహణకు వెళ్లిపోయాడు. ఈమె ఆటో ఎక్కిన కొద్ది దూరంలోనే ఇద్దరు మహిళలు ఆటో ఎక్కి వరలక్ష్మికి ఇరువైపులా కూర్చుని ప్రయాణంలో మాట కలిపారు. ఇద్దరు మహిళలు తాళ్లూరు వద్ద దిగిపోగా వరలక్ష్మి జగ్గంపేటలో దిగి ఇంటికి వెళ్లిపోయారు. కొంతసేపటికి హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న ఫోన్ మోగడంతో ఫోన్ తీసిన బాధితురాలు బ్యాగ్ జిప్ తెరిచి ఉండటం గమనించారు. అందులో ఉన్న 3 కాసుల నల్లపూసల తాడు, రూ.1,000 నగదు కనిపించలేదు. షాక్‌కు గురైన ఆమె తల్లి సహాయంతో మూడు రోజుల అనంతరం జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అయితే మా పరిధి కాదు గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లమని జగ్గంపేట పోలీస్ స్టేషన్లో చెప్పడంతో అక్కడకు వెళ్లారు. గండేపల్లిలో కూడా ఇదే అనుభవం ఎదురవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో బాధితులు మిన్నకున్నారు. ఫ్రెండ్లీ పోలీస్, 101, మహిళలకు రక్షణ వంటి చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ జగ్గంపేట, గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుల పట్ల స్పందించిన తీరుపై బాధితులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేద్దామని పోలీస్ స్టేషన్లకు వెళ్లితే మా పరిధి కాదంటూ ఫిర్యాదు తీసుకోకపోతే తమకు ఇంకేమీ న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు.

ఆమె జగ్గంపేటలోనే ఫిర్యాదు చేయాలి

ఆమె జగ్గంపేటలో ఇంటికి వెళ్లిన కొద్దిసేపటి తర్వాత బ్యాగ్‌ను తనిఖీ చేసుకోగా బంగారం, నగదు చోరీ అయినట్టు నిర్ధారించుకున్నారు. కాబట్టి బాధితురాలు జగ్గంపేటలోనే ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

– యువీ శివ నాగబాబు, ఎస్సై, గండేపల్లి

ఎక్కడ పోయిందో తెలియదు కాబట్టి ఫిర్యాదు స్వీకరించలేదు

పాలేపు వరలక్ష్మి ఆగస్టు 4న జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. నాలుగు రోజుల ముందు రాజమహేంద్రవరం వెళ్లామని, అక్కడి నుంచి ఆటో లో వస్తుండగా చోరీ జరిగిందని చెప్పారు. మల్లేపల్లిలో కొందరు మహిళలు ఆటో ఎక్కి తాళ్లూరులో దిగారని వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. ఎప్పుడు ఎక్కడ పోయిందో తెలియదు కాబట్టి ఫిర్యాదు స్వీకరించలేదు.

–టి.రఘునాథరావు, ఎస్సై, జగ్గంపేట

హోరాహోరీగా అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

నేడు ముగింపు, బహుమతుల ప్రదానం

తుని రూరల్: అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శ్రీప్రకాష్ విద్యా సంస్థలలో ఇవి నిర్వహిస్తున్నారు. ఆదివారం రెండవ రోజూ సీబీఎస్ఈ క్లస్టర్ -7 అంతర్రాష్ట్ర బాలురు, బాలికల అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 180 జట్లకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-19 బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని సిస్టర్స్ నివేదిత స్కూల్ (హైదరాబాద్), ద్వితీయ స్థానాన్ని వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి), తృతీయ స్థానాన్ని సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ (ఏలూరు) కైవసం చేసుకున్నట్టు సీబీఎస్ఈ పరిశీలకుడు సీహెచ్ఎంఎల్.శ్రీనివాసు తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో జట్లు తమ సత్తా చాటి క్వార్టర్ ఫైనల్స్ వైపు దూసుకువెళుతున్నాయన్నారు. వీటి ఫలితాలు సోమవారం వస్తాయని, విజేతలకు అదేరోజు బహుమతుల ప్రదానం జరుగుందన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ఆంధ్ర, తెలంగాణాల నుంచి విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా అండర్-17 చెస్ పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలతో చెస్ అసోసియేషన్ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా స్థాయి అండర్ -17 చెస్ పోటీలు జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి విద్యా సంస్థల్లో ఆదివారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలకు దాదాపు 60 మంది క్రీడాకారులు వచ్చి తమ ప్రతిభకు పదను పెట్టారు. పోటీల్లో బాలురు నుంచి ముగ్గురిని, బాలికల నుంచి ముగ్గురిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కవురు జగదీష్ చెప్పారు. బాలుర విభాగంలో గిరిమణి శేఖర్ (ప్రథమ), బండారు నానిబాబు (ద్వితీయ), తాడి సాయి వెంకటేష్ (తృతీయ), బాలికల విభాగంలో పనిశెట్టి ధరణి (ప్రథమ), బొడ్డు సాన్వి (ద్వితీయ), పసుపులేటి రేష్మ (తృతీయ) గెలిచారని తెలిపారు. వీరు ఈ నెల 16,17 తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా తరఫున ఆడతారని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. విజేతలకు విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఆకుల బాపన్నాయుడు షీల్డులు అందజేశారు.

స్నానానికి వెళ్లి అనంతలోకాలకు..



వంశీకృష్ణ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగి మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మూరు రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన ఊట వంశీకృష్ణ(18) శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి పుష్కరాలరేవులో గోదావరి స్నానానికి వెళ్లాడు. స్నేహితులతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ మురళీకృష్ణ మునిగిపోయాడు. రాత్రంతా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 10.00 గంటల సమయంలో కుమారి టాకీస్ సమీపంలో దోభీఘాట్ వద్ద మురళీకృష్ణ మృతదేహం లభించింది. టుటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై అశ్వక్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

ఉన్నత చదువులు చదువుతాడని...

మురళీకృష్ణ తండ్రి శ్రీను ఎస్‌వీజీ మార్కెట్‌లో జట్టుకూలీగా పనిచేస్తుంటాడు. తనలాగా తన కొడుకు ఉండకూడదని మురళీకృష్ణను స్థానికంగా ఉన్న ప్రైవేటు జూనియర్ కాలేజీలో జాయిన్‌చేసి చదివిస్తున్నాడు. ప్రస్తుతం సెకండియర్ చదువుతున్నాడు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి వెళతావనుకుంటే మా అందరిని వదిలేసి వెళ్లిపోయావేంటి వంశీ అంటూ శ్రీను దంపతులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అన్నదమ్ముల మధ్య విభేదాలతో మనస్తాపం



తానేటి శ్రీనివాస్ (ఫైల్)

నిడదవోలు: పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామానికి చెందిన తానేటి శ్రీనివాస్ (42) ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. అన్నదమ్ముల మధ్య ఏర్పడ్డ చిన్నపాటి విభేదాలతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ ఈనెల 8న పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుడిని వెంటనే కుటుంబ సభ్యులు తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న శ్రీనివాస్‌కు భార్య భాగ్యలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెరవలి ఎస్సై ఎం. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనల్స్ దశలో జాతీయ హాకీ పోటీలు



పోటీ పడుతున్న హర్యానా, ఛత్తీస్‌గఢ్ జట్ల క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీలు ఆదివారం కాకినాడ డీఎస్ఏలో సెమీఫైనల్స్ పూర్తి చేసుకుని ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సెమీఫైనల్స్‌లో రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి సెమీ ఫైనల్స్‌లో హర్యానా, ఛత్తీస్‌గఢ్ పోటీపడగా హర్యానా 3-0 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్స్ జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ మధ్య జరుగగా జార్ఖండ్ 3-0 స్కోర్‌తో గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. మూడోస్థానానికి మంగళవారం ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్ జట్లు పోటీ పడనున్నాయి. ఫైనల్స్ హర్యానా, జార్ఖండ్ జట్ల మధ్య నిర్వహించనున్నారు. క్రీడాకారులకు సోమవారం విశ్రాంతిరోజు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి పి.థామస్, భవానీశంకర్, వి.రవిరాజు పోటీలను పర్యవేక్షించారు.